క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశాలు

కొల్చారం(నర్సాపూర్)/మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర గురుకుల పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరిలో ఐదో తరగతి ప్రవేశాల కోసం ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కొల్చారం సోషల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్ష కోసం ఈనెల 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగానే సీట్లు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులుగా పేర్కొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న వెంకటేశ్వరశర్మ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలోని బగలాముఖీ శక్తిపీఠంలో అన్నదాన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ మాట్లాడుతూ ఆలయాన్ని దాతల సహాయంతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. భోజనశాల నిర్మాణానికి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ముందుకు వచ్చారన్నారు. ప్రస్తుతం అమావాస్య, పౌర్ణమి రోజుల్లో దాతల సహాయంతో అన్నదానం నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో భక్తుల తాకిడికి అనుకూలంగా నిత్య అన్నదానం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ భాగ్యలక్ష్మి

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండలం కాళ్లకల్ డీసీసీబీ బ్యాంక్‌లో సీబీఆర్ఎం సమావేశం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బ్యాంక్ రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలను వ్యాపారాలకు వినియోగించుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం పెంటాగౌడ్, సీసీలు శోభారాణి, కృష్ణవేణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ అరుణ్, గ్రామ సంఘం లీడర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

ఇస్లాంపూర్‌లో గడ్డివాము దగ్ధం

తూప్రాన్: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలుకు చెందిన గడ్డివాము గురువారం దగ్ధమైంది. సుమారు రూ.30 వేల విలువైన గడ్డి కాలి బూడిదైందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

బైక్ ఢీకొని.. ఒకరికి గాయాలు


గాయపడ్డ దుర్గానాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్, టీవీఎస్ ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన మండలంలోని సలాబత్‌పూర్ సమీపంలో చోటుచేసుకుంది. కొత్తచెరువు తండా పంచాయతీ ఇరుకుతండాకు చెందిన దుర్గానాయక్ తన టీవీఎస్ వాహనంపై సలాబత్‌పూర్‌వైపు నుంచి తండాకు వస్తున్నాడు. అదే సమయంలో కౌడిపల్లి నుంచి సలాబత్‌పూర్‌వైపు వెళుతున్న ఒక బైక్ ఆయనను ఢీ కొట్టింది. దీంతో గాయపడిన దుర్గానాయక్‌ను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

దుబ్బాక: విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కో కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ సూచించారు. గురువారం వివిధ పాఠశాలకు చెందిన 600 మందికి పైగా విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- సబ్ ఈఆర్ఓ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీ
- అవస్థలు పడుతున్న ప్రజలు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండలంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుకు కారణం సబ్ ఎలక్ట్రికల్ రెవెన్యూ కార్యాలయంలో అధికారుల కొరతేనని వాపోతున్నారు. కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దశంకరంపేట సబ్ ఈఆర్ఓ(ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్)లో జూనియర్ అకౌంట్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌ల పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యుత్ వినియోగదారులు జిల్లా కేంద్రమైన మెదక్ వెళ్లి తమ ఫిర్యాదులను అందజేయాల్సి వస్తోంది. పెద్దశంకరంపేట సబ్ ఈఆర్ఓ కార్యాలయంలో అధికారులను నియమించడంలో జిల్లా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో సమస్యలకు పరిష్కారం దొరకడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే..

మండలంలో 27 గ్రామ పంచాయతీలున్నాయి. అక్కడ 133/11 కేవీ సబ్ స్టేషన్‌తో పాటు పలు 33 కేవీ సబ్ స్టేషన్లు ఉన్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట విద్యుత్ సమస్య తెలత్తుతోంది. ఏడాదిన్నర క్రితం బదిలీపై వెళ్లిన జేఏఓ స్థానంలో ఇప్పటి వరకూ ఎవరినీ నియమించలేదు. దీంతో సిబ్బంది తక్కువగా ఉండడంతో విద్యుత్ వినియోగదారులు అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లుల సమస్యతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించుకోవాలంటే జిల్లా కేంద్రమైన విద్యుత్ కార్యాలయానికి వెళ్లక తప్ప పరిస్థితి నెలకొంది. 50 కిలోమీటర్లు వెళ్లడం వల్ల తీవ్ర వ్యయప్రయాసాలతో పాటు సమయం కూడా వృథా అవుతోందని వినియోగదారులు వాపోతున్నారు.


సబ్ ఎలక్ట్రిసిటీ కార్యాలయం


ఖాళీగా దర్శనమిస్తున్న జేఏఓ కుర్చీ

సిబ్బంది భర్తీకి చర్యలు

పెద్దశంకరంపేట సబ్ ఈఆర్ఓలో సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటాం. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తాం. జేఏఓ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌ల భర్తీ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– రణవీర్‌సింగ్, ఇన్‌చార్జి ఏఓ, మెదక్

అక్కడ ఫుల్.. ఇక్కడ నిల్

డివిజన్ పరిధిలో నర్సాపూర్, పెద్దశంకరంపేటలోని సబ్ ఈఆర్ఓ(ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం)లు ఏర్పాటు చేశారు. నర్సాపూర్ సబ్ ఈఆర్ఓ ఆఫీస్‌లో మాత్రం పూర్తి స్థాయిలో సిబ్బందిని కేటాయించి, పెద్దశంకరంపేట సబ్ ఈఆర్ఓ ఆఫీస్‌పై మాత్రం చిన్నచూపు చూస్తున్నారని పలు విమర్శలున్నాయి. పెద్దశంకరంపేట సబ్ ఈఆర్ఓ పరిధిలో రేగోడ్, టేక్మాల్, పాపన్నపేట, అల్లాదుర్గం మండలాలున్నాయి. దాదాపు ఇక్కడ కేటగిరి 1 నుంచి కేటగిరి 5 వరకు 50 వేల కనెక్షన్‌లున్నాయి. పెద్దశంకరంపేట సబ్ ఈఆర్ఓ పరిధిలో పనిచేయాల్సి ఉన్నా జిల్లా కేంద్రంలోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం పెద్దశంకరంపేటలోని సబ్ ఈఆర్ఓ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు స్పెషల్ క్యాంపు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. అధికారులను పూర్తిస్థాయిలో నియమిస్తే సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే అవకాశం ఉందని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● విద్యార్థినుల క్షేత్రస్థాయి పర్యటన


మల్లారెడ్డి అగ్రికల్చర్, తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో చదువుకుంటున్న అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘాన్ని సందర్శించారు. రైతులకు విత్తనాలు, రసాయన ఎరువులు, రుణాలు, సబ్సిడీపై విత్తనాల గురించి పీఏసీఎస్ సీఈఓ మధు వారికి వివరించారు. అనంతరం వ్యవసాయ కార్యాలయం, నవాబుపేటలో రైతులు సాగు చేస్తున్న పంటలను విద్యార్థినులు పరిశీలించారు. - శివ్వంపేట(నర్సాపూర్)

గురుకులంలో మాక్ అసెంబ్లీ

నారాయణఖేడ్: పట్టణంలోని మైనార్టీల గురుకులంలో గురువారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ విద్యార్థులు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, శాసనసభ స్పీకర్ తదితర పాత్రలను పోషించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఖాదర్ అసెంబ్లీ నిర్వహణ తదితరాల అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

వంతెన నిర్మాణానికి హామీ


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజిరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కూచనపల్లిలో సుదీర్ఘకాలంగా బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామానికి చెందిన మడప రాజిరెడ్డి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో వాగుపైన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు రాజిరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం



సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తదితరులు

వెల్దుర్తి(తూప్రాన్): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వెల్దుర్తి సర్పంచ్ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ప్రజలకు అవగాహన కలిగించారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, సురక్ష బీమా, రైతు బీమా భరోసా, అటల్ పెన్షన్, జన్‌ధన్ ఖాతాలు, ఉజ్వల యోజన, ఆహార భద్రత భరోసా, పేదలకు సొంతింటి నిర్మాణ కల, కనీస సదుపాయాల కల్పన వంటి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, ఇండియన్ గ్యాస్ డీలర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లి గ్రామంలో ఆయుష్మాన్‌భారత్, పీఎం కిసాన్‌యోజన, పలు బీమా పథకాల గురించి ప్రజలకు ఎల్‌ఈడీ స్క్రీన్‌పై లఘుచిత్రాలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూదెమ్మ, బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, వైద్యులు వేదాద్రి, నీలకంటి అమిత్, సిబ్బంది వెంకటేశం, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐకమత్యంతో మెలగాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): పద్మశాలీలు ఐకమత్యంతో మెలగాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో గురువారం పట్టణ పద్మశాలి సేవా సంఘం, చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం, కార్యదర్శులు ప్రభాకర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు

ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల గ్రామాలలోను జోరుగా కొనసాగుతోంది. గురువారం వివిధ గ్రామాలు, పట్టణాలలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ దరఖాస్తులు అందజేశారు. అంతే కాకుండా ఇతర సమస్యలపై కూడా తమ విన్నపాలు అధికారులకు అందజేశారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నేతలు పిలుపునిచ్చారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు పడాలపల్లిలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.


తూప్రాన్: పడాలపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా


కౌడిపల్లి: జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు


పెద్దశంకరంపేట(మెదక్): శివాయిపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్



నర్సాపూర్‌లో దరఖాస్తు అందుకుంటున్న ఆర్‌డీఓ, కమిషనర్ తదితరులు


శివ్వంపేట(నర్సాపూర్): కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు


కౌడిపల్లి: రాజిపేట గ్రామసభలో..

పదోన్నతులకు అడ్డంకులు తొలగించాలి

టీపీటీఫ్ మండల అధ్యక్షుడు రమేశ్‌చారి


చిన్నశంకరంపేటలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఫ్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో టీపీటీఫ్ మండల అధ్యక్షుడు రమేశ్‌చారి ఆధ్వర్యంలో ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. గురువారం చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన అడ్డంకులను తొలగించి షెడ్యూల్ ప్రకటించాలని, స్థానచలనం పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి వేణుగోపాలచారి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని, మిగతా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, దీప్లా, ఫణీంద్రచారి, సుధాకర్, జగన్, అన్నపూర్ణ, రాథోడ్, చంద్రం, రియాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్, సంఘ నాయకులు యాదగిరి, మహేందర్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో.. మండల పరిధిలోని పలు పాఠశాలల్లో టీపీటీఎఫ్ 2024 క్యాలెండర్‌లను ఆవిష్కరించామని టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు రతన్, ప్రధాన కార్యదర్శి బిక్షపతి తెలిపారు. గురువారం చిలప్‌చెడ్, గౌతాపూర్ గ్రామాలలోని ఉన్నత పాఠశాల ఆవరణలో క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ నిరంతరం శ్రమిస్తుందన్నారు. ఉపాధ్యాయులు రమేశ్, ఆదినారాయణ, రుక్మిణి, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు


పెద్దగొట్టిముక్లలో అక్షింతలతో పాద యాత్ర చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతల కలశాన్ని ఊరేగించారు. గురువారం గ్రామ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి రామ కీర్తనలతో పాదయాత్ర నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ వరిసాగు పరిశీలన


వరినాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని భీమ్‌రావుపల్లి గ్రామంలో వరి పొలాలను రామాయంపేట వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు వసంత సుగుణ పరిశీలించారు. గురువారం గ్రామంలోని రైతు బోయిని ప్రవీణ్ పొలంలో డ్రమ్ సీడర్ సహాయంతో వరి నారును నాటించారు. ప్రతి రెండు మీటర్లకు అర్ధ గజం చొప్పున కాలిబాటలు తీయించారు. వాటి వల్ల గాలి, వెలుతురు సక్రమంగా చేరి నారు బలంగా, ఏపుగా పెరుగుతుందని చెప్పారు. తద్వారా దిగుబడి అధికంగా వస్తుందని ఏడీఏ వసంత సుగుణ రైతులకు వివరించారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణ అధికారిణి విజృంభణ, పలువురు రైతులు ఉన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


రోబోను పరిశీలిస్తున్న విద్యార్థినులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని తమకు ఇష్టమైన రంగాల్లో రాణించాలని సేయింట్ మేరీస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల విద్యానికేతన్‌లో గురువారం హైదరాబాద్‌కు చెందిన ప్రాటెండ్ కంపెనీ ప్రతినిధులు వివిధ రకాల రోబోలను తయారు చేసి వాటి పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. విండ్ మిల్ రోబో, ఫ్లాగ్ హోస్టింగ్ రోబోలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


భోగి మంట చుట్టూ చిన్నారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి, భోగి మంటలు వెలిగించారు. ఆ మంటల చుట్టూ కోలాటం ఆడారు. గంగిరెద్దు విన్యాసాలు అందరినీ అలరించాయి. విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.